

# వనమూలికా వైద్యవిధానము

## శిక్షణా కరదీపిక

డా॥ జి. బుల్లియ్య

వనంతరం, అడ్డతీగల



## ముందుమాట

లయ సంస్థ గత 25 సంవత్సరాలుగా ఆదివాసీ సమాజాల సుస్థిర అభివృద్ధి కొరకు పనిచేస్తున్న విషయం పాఠకులకు తెలిసిందే. తూర్పుగోదావరిజిల్లా ‘అడ్డతీగల’ లో ప్రారంభింపబడిన ఈ స్వచ్ఛంద సేవాసంస్థ, విశాఖపట్నం ప్రధాన కార్యాలయంగా ఆరు ఆదివాసీ జిల్లాల్లో పనిచేస్తుంది. ప్రధానంగా విద్య, ఆరోగ్యం, వ్యవసాయ, అటవీ, ఉపాధి, ఇంధన, మీడియా రంగాల్లో ప్రత్యామ్నాయాల అభివృద్ధికి కృషి చేస్తుంది. ‘ఆరోగ్యం’నకు సంబంధించి వనమూలికా వైద్య విధాన అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ దాని ఆచరణ, అధ్యయనాలపై పనిచేయడం కోసం అడ్డతీగల్లో **‘వనంతరం’** పేరుతో వనమూలికా వైద్యాభివృద్ధి సంస్థ (రిసోర్సు సెంటర్)ను స్థాపించి, నడుపుతుంది. ‘వనమూలికా వైద్యం’ పై శిక్షణను వనంతరం ఒక ప్రత్యేక అంశంగా చేపట్టింది. నాణ్యతా ప్రమాణాల దృష్ట్యా ఎంతో నాసిరకంగా ఉన్న మరియు ఆదివాసీలకు ఏ మాత్రం అందుబాటులోలేని ప్రభుత్వ ఆరోగ్య సేవలకు అనుబంధంగా, (ఉపాంత సేవగా) వనమూలికా వైద్యాన్ని అందించి, దీని విలువను మరియు వాడకాన్ని అభివృద్ధి చేయాలన్నది వనంతరం ఆలోచన.

ఆదివాసీ ప్రాంతాల్లోని ఆరోగ్య పరిస్థితులను, ఆయా పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించిన మీదట వారి ఆరోగ్య అవసరాలను పూర్తిగా తీర్చగలిగినది. ఇక్కడి పరిస్థితులకు అనుగుణమైనది, సామాజికంగా వారికి దగ్గరగా ఉండే, ఆర్థికంగా భరింపదగినది, నమ్మదగినది మరియు ఆచరణీయమైనది అయిన ప్రత్యామ్నాయ సంప్రదాయ వైద్య విధానాన్ని దేనినైనా ఇక్కడ ప్రోత్సహించాల్సిన అవసరాన్ని గుర్తించింది. ఆ తరువాత అనేకమంది సంప్రదాయ వైద్యులలో నిర్వహించిన వివిధ కార్యక్రమాలు, సంభాషణలు, చర్చల ద్వారా స్థానిక ఆరోగ్య అవసరాలను తీర్చగల సామర్థ్యం ఇక్కడి మూలికా వైద్య విధానంనకు ఉందని భావించింది.

నాటి నుండి ఈ సంప్రదాయ వైద్య విజ్ఞానం, పద్ధతులు, ఆచరణీయత, స్వయంశక్తిలను గూర్చి తెలుసుకోవడానికి ఒక నిరంతర అధ్యయనాన్ని చేపట్టడంతో పాటు, వీటి పునరుద్ధరణ కొరకు ప్రచార, శిక్షణా కార్యక్రమాలను చేపట్టి, వీటిద్వారా గ్రామాల్లో వైద్యసేవలు అందించడం, స్థానికంగా అందుబాటులో ఉన్న మందు మొక్కలను, చికిత్సా పద్ధతులను గుర్తించి గ్రంథస్థం చెయ్యడం, మూలికా వనాలను, సంరక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయడం, ఆదివాసీ ప్రాంతాల్లోని కొన్ని విలక్షణ మరియు సాధారణ ఋగ్మతలకు మందుల తయారీలపై వనంతరం ప్రధానంగా దృష్టిని కేంద్రీకరించింది. దీని ద్వారా ఆదివాసీ ప్రాంతాల్లో ఆరోగ్యసేవలు అందుబాటులోనికి తేవడమే కాకుండా, వారిపై ఆర్థిక భారాన్ని తగ్గించాలని ఇది భావించింది. అందువల్లే ఆసక్తిగల ఆదివాసీ యువతీయువకులను గుర్తించి,